క్లుప్తంగా

వివాదాలకు దూరమవ్వండి.. ప్రశాంతతకు దగ్గరవ్వండి

వంకాయలపాడు వాసులకు రూరల్ సీఐ బి.అశోక్‌కుమార్ సూచన



యడ్లపాడు: మండలంలోని వంకాయలపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు నరసరావుపేట డీఎస్పీ కేవీ మహేష్ ఆధ్వర్యంలో చిలకలూరిపేట రూరల్ సీఐ బి.అశోక్ బాబు, ఎస్ఐ పి.సురేష్‌లు పాల్గొన్నారు. తొలుత గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన బొడ్డు రాయి సెంటర్లో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో నేరుగా ప్రజా సమస్యల్ని తెలుసుకునే ప్రక్రియలో భాగంగా పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలతో పోలీసులు స్నేహంగా మెలిగేందుకు పల్లెనిద్ర దోహదపడుతుందన్నారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని చెప్పారు. అనవసరమైన వివాదాలు, గొడవలు, ఘర్షణలు పడి ఆర్థిక, ఆరోగ్య, కుటుంబ పరంగా నష్టపోవద్దని సూచించారు. కులమతాలు, పార్టీ, వర్గబేధాలు వీడి గ్రామస్తులంతా కలిసిమెలసి జీవించాలని కోరారు. స్థానికంగా ఏదైనా సమస్య వచ్చినపుడు ఇరువర్గాలకు చెందిన పెద్దలు మాట్లాడుకొని సమన్వయంతో శాంతియుతంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో పల్లెనిద్ర చేశారు.

మెరుగైన సేవలు అందించాలి

ఈపూరు: మండలంలోని ముప్పాళ్ల -1 సచివాలయాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ వరలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయంలోని రికార్డులను ఆమె పరిశీలించి సిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. సచివాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సచివాలయ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. అదేవిధంగా వెల్ఫేర్ ఆఫీసర్, ఏఎన్ఎంతో బంగారు తల్లి పథకం గురించి మాట్లాడారు. అనంతరం విద్యానికేతన్ పాఠశాల, ధనలక్ష్మి వ్యాయామ కళాశాలను పరిశీలించి పథకం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 23న శ్రీమద్భగవద్గీత కంఠస్థ పోటీలు

నరసరావుపేట ఈస్ట్: తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి గుంటూరుజిల్లా శాఖ ఆధ్వర్యంలో గీతా జయంతి మహోత్సవాన్ని పురస్కరించుకొని డిసెంబర్ 23వ తేదీన గీతామందిరంలో శ్రీమద్భగవద్గీత కంఠస్థ పఠన పోటీలు నిర్వహిస్తున్నట్టు పోటీల నిర్వాహకురాలు ఈ.అమ్మడు తెలిపారు. ఈమేరకు గీతామందిరం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోటీల కరపత్రాన్ని విడుదల చేశారు. పోటీలు 4విభాగాలుగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 6, 7వ తరగతి విద్యార్థులకు కర్మయోగం 3వ అధ్యాయం 1 నుంచి 30 శ్లోకాలు, 8, 9 తరగతుల విద్యార్థులకు కర్మయోగం 3వ అధ్యాయం 1 నుంచి 40 శ్లోకాలు, 18 సంవత్సరాల వయస్సు లోపు వారికి, పైబడిన వారికి 18 అధ్యాయాలలోని శ్లోకాలు పోటీ ఉంటుందని వివరించారు. పోటీ విజేతలకు నగదు బహుమతి తోపాటు ప్రశంసా పత్రం అందిస్తామని తెలిపారు.

క్లాప్ మిత్రలకు ఆరోగ్య బీమాపై అవగాహన

వినుకొండ(నూజెండ్ల): ఐటీసీ-సెర్ప్ ఆధ్వర్యంలో క్లాప్ మిత్రలకు ఆరోగ్య బీమాపై అవగాహన కార్యక్రమం నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో టి.వీరభద్రాచారి పాల్గొని మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ పేద, అణగారిన గ్రామీణ కుటుంబాలు, పట్టణ కార్మిక కుటుంబాలను గుర్తించి వృత్తివర్గాన్ని లక్ష్యంగా చేసుకొని ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను అందిస్తుందన్నారు. ఐటీసీ-సెర్ప్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి రోజూ చెత్త సేకరణ కార్యక్రమాన్ని విధిగా నిర్వహించాలని తెలిపారు. గ్రామాల్లో మురుగు నీరు కుంటలు లేకుండా చేసి ప్రజల ఆరోగ్యాలకు రక్షణగా నిలవాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రవికుమార్, స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ సమన్వయకర్త సుబ్బరామయ్య, ఐటీసీ సిబ్బంది ప్రదీప్‌కుమార్, ఏసోబు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

ఘనంగా రామాలయ ప్రతిష్ట

నాదెండ్ల: స్థానిక ఉరవకట్ట సెంటర్ బీసీ కాలనీలో వైష్ణవీ హరిదాసుల సంఘం ఆధ్వర్యంలో రూ.25 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన కోదండ రామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశాఖపట్టణంకు చెందిన వేద పండితులు ఉదయం 9.19 గంటలకు సాంప్రదాయబద్ధమైన మేళతాళాలతో ప్రతిష్ఠ నిర్వహించారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన తేళ్ల శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి దంపతులు అందించిన ఆర్థిక సాయంతో ఆలయం నిర్మాణ పనులు జరిగాయి.

ప్రతీ గడపకు జగనన్న లబ్ధి చేకూరింది



ఏనుగుపాలెం గ్రామసచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



గుంటుపాలెంలో సంక్షేమ బోర్డును అవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



యడ్లపాడు సభలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, వేదికపై పార్టీ శ్రేణులు, అధికారులు



గుట్లపల్లి సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు, ప్రతినిధులు

వినుకొండ(నూజెండ్ల): వై ఏపీ నీడ్స్ జగన్ వినుకొండ రూరల్ మండలంలోని ఏనుగుపాలెం గ్రామ సచివాలయంలో కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో సంక్షేమ అభివృద్ధి గురించి వివరించే వివరాల బోర్డును, బ్రోచర్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే సంక్షేమంలో భాగంగా అమలు చేసిన పథకాలు ప్రతిగడపకు అందాయని, లబ్ధిదారులకు గ్రామాల్లో అతిచేరువలో సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ద్వారా సేవలను ఇంటి వద్దకే తీసుకొచ్చారన్నారు. అటువంటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ గెలవాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దండు చెన్నయ్య, ఎంపీపీ జయశ్రీ వెంకట రామిరెడ్డి, జెడ్పీటీసీ విజయలక్ష్మి రాజా, సొసైటీ చైర్మన్ అనుమోలు నాసరరెడ్డి, రొడ్డా పుల్లారెడ్డి, ఎ. వెంకటేశ్వరరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చింతలచెరువులో...

నూజెండ్ల మండలంలోని చింతలచెరువు గ్రామ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో సంక్షేమ అభివృద్ధి గురించి వివరించే వివరాల బోర్డును, బ్రోచర్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు ఆవిష్కరించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ఎందుకు గెలవాలో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నక్కా నాగిరెడ్డి, ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, వినుకొండ మార్కెట్‌యార్డ్ చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, వైస్ చైర్మన్ కొమిరిశెట్టి రామారావు, మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, సొసైటీ చైర్మన్ పొట్లపల్లి పిచ్చిరెడ్డి, కంచర్ల బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామప్రజలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశ్రేయస్సే పరమావధిగా ..

శావల్యాపురం: ప్రజాశ్రేయస్సే పరమావధిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుంటుపాలెం గ్రామసచివాలయ పరిధిలో వై నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు అధికారులు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల సమక్షంలో నిర్వహించారు. తొలిత సచివాలయంలో ఏర్పాటు చేసిన మానమ్మకం నువ్వే జగన్ డిస్‌ప్లే సంక్షేమ పథకాలతో కూడిన బోర్డును అవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గుంటుపాలెం గ్రామసచివాలయ పరిధిలో ఇప్పటి వరకు సంక్షేమ పథకాల రూపంలో అర్హత కలిగిన లబ్ధిదారులకు రూ. 4 కోట్ల 69 లక్షల 459 రూపాయల లబ్ధి చేకూరిందన్నారు. అధికారం కోసం మోసపూరిత మాటలు చెప్పి టీడీపీ నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి వై నీడ్స్ జగన్ కార్యక్రమంపై చేసిన అభివృద్ధి పనులు సంక్షేమం గురించి పుస్తకాలు ప్రజలకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, చినకంచర్ల గ్రామపంచాయతీ సర్పంచ్ పురేటి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పచ్చవ శ్రీనివాసరావు, కావూరి మాబుసుభానయ్య. పంచాయతీ కార్యదర్శులు చింతా శ్రీనివాసరావు, శ్రీవల్లీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

యడ్లపాడులో..

యడ్లపాడు: ప్రజా సంక్షేమమే పరమావధిగా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ సేవాదళ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు కల్లూరి విజయ్ కుమార్ చెప్పారు. యడ్లపాడు గ్రామ సచివాలయం-2 పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం శుక్రవారం జరిగింది. పార్టీ మండల అధ్యక్షులు ఘంటా శంకర్ ఆధ్వర్యాన జేసీఎస్ కన్వీనర్ రాచమంటి చింతారావు అధ్యక్షతన తొలుత ప్రజాప్రతినిధులు, పార్టీశ్రేణులు సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును, తదుపరి తహసీల్దార్ కూడలిలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన 'మా నమ్మకం నువ్వే జగన్' సభకు విజయ్‌కుమార్‌తో పాటు ఎంపీపీ పిడత ఝాన్సీ, జెడ్పీటీసీ ముక్తా వాసు, ఎంపీటీసీ కీర్తి అరుణ్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో సంక్షేమ సామ్రాజ్యాన్ని స్థాపించి అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, పేద, మధ్యతరగతి కుటుంబాలను సంక్షేమ పథకాలతో ఆదుకుంటున్నారని వివరించారు. ఎన్నికల హామీలను వంద శాతం నెరవేర్చడమే కాకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా గడపగడపకు సంక్షేమ ఫలాలు చేరవేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి రెండింటిని సమపాళ్లలో అందిస్తున్న జగనన్నకు మద్దతునిచ్చి దీవించాలన్నారు. మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయితే అన్ని వర్గాలకు మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రజలను చైతన్యం చేసేందుకు పార్టీ శ్రేణులు, రథసారథులు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సంక్షేమానికి మారుపేరు సీఎం వైఎస్ జగన్

చిలకలూరిపేట: సంక్షేమానికి మారుపేరు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన అని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు చెప్పారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని పట్టణంలోని 6,11 వార్డులతో పాటు మండలంలోని మురికిపూడి-2 సచివాలయ పరిధిలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదరికం నిర్మూలనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. దీనికి తోడు నాడు-నేడు కార్యక్రమం ద్వారా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకంలోనూ ప్రజా సంక్షేమమే పరమావధిగా ఉంటున్నదని వెల్లడించారు. ఇలాంటి గొప్ప పరిపాలన గతంలో ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు. పది కాలాల పాటు ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణంలోని 6వార్డు పరిధిలో రూ. 27.69 కోట్లు, 11 వార్డు పరిధిలో రూ. 15.13 కోట్లు, మండలంలోని మురికిపూడి-2 సచివాలయ పరిధిలో 17.49 కోట్ల మేర ప్రజలకు లబ్ధి చేకూరిందని వివరించారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, జేసీఎస్ కన్వీనర్ తోట బ్రహ్మస్వాములు, ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి పాల్గొన్నారు.

గుట్లపల్లి సంచివాలయంలో...

బొల్లాపల్లి: మండలంలోని గుట్లపల్లి సంచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు సచివాలయ పరిధిలోని సంక్షేమాభివృద్ధి పథకాలు తెలిపే బోర్డును ఆవిష్కరించారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించి, అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో జడ్పీటీసీ రామావతు బీమీబాయి కృష్ణానాయక్ మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా సంక్షేమ పథకాలు చేపట్టి నూటికి 90 శాతానికిపైగా అమలు చేసిన పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు. ఈ సచివాలయం పరిధిలో రూ.26.56 కోట్ల మేర సంక్షేమాభివృద్ధి జరిగిందని, 1216 మంది లబ్ధిదారులు లబ్ధిపొందారని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ప్రాధాన్యత ఇచ్చారని, నాడు-నేడులో పాఠశాలను కార్పొరేషన్ స్థాయిలో తీర్చిదిద్దడంతో పాటు ప్రతి పేద విద్యార్థి ఇంగ్లిష్ మీడియంలో విద్యాభ్యాసం చేసే విధంగా ఆంగ్ల బోధన ప్రవేశపెట్టారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం హయాంలో లేనిది ఉన్నట్లు చూపించడమే టీడీపీ ప్రభుత్వ పాలన అని, అదే వైఎస్సార్ సీపీ పాలనలో సంక్షేమం ప్రగతి పథంలో దూసుకుపోయిందన్నారు. వైఎస్సార్ కుటుంబ సభ్యులుగా, అందరూ కలిసికట్టుగా ముందుకు వచ్చి పార్టీని మరోమారు గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఏడు దశాబ్దాల కల అయిన వరికపూడిశెల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడడంతో పాటు పేదలకు అండగా ఉండే పార్టీ వైఎస్సార్ సీపీ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో బి. గోవిందునాయక్, గురవయ్య, ఎం. రాజయ్య, ఎం. రమణారెడ్డి, బి. అవినాష్‌రెడ్డి, ఎస్. శ్రీనివాసరెడ్డి, మన్నేపల్లి, ఎం. పెదనాగిరెడ్డి, దోర్నల రవి, అధికారులు ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీబాషా, సచివాలయం సిబ్బంది గృహ సారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మండల వాసులకు రూ.35.70 కోట్ల లబ్ధి

చిలకలూరిపేట ఎమ్మెల్యే, మంత్రి విడదల రజిని సహకారంతో యడ్లపాడు-2 సచివాలయం పరిధిలో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి రూ.35,70,11,069కోట్ల లబ్ధి రెండు గ్రామాల ప్రజలకు చేకూరిందన్నారు. డీబీటీ, నాన్ డీబీటీ కలిపి మొత్తం 33 సంక్షేమ పథకాల ద్వారా రూ.32,99,36,069 కోట్లు లబ్ధిచేరగా, పలు అభివృద్ధి పనులకు సంబంధించి రూ.2,70,75,000 కోట్ల నిధులు వచ్చాయన్నారు. వీటిలో నాడు-నేడు కింద పాఠశాలలు, ఆసుపత్రులకు రూ.33.71 లక్షలు, గ్రామ సచివాలయ భవన భవన సముదాయాలకు రూ.95.04 లక్షలు, గడపగడపకు మనప్రభుత్వం కింద రూ.20 లక్షలు, రోడ్ల నిర్మాణాలకు రూ.1.10 కోట్లు, ఇతర అభివృద్ధి పనులకు రూ.12 లక్షలతో వివిధ పనులకు వెచ్చిస్తున్నట్లు వివరించారు. అనంతరం గ్రామంలోని ఆయా ప్రాంతాల్లో పలు ఇళ్లను సందర్శించి గత నాలుగేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన పాలనాప్రగతి, సంక్షేమ, అభివృద్ధి వివరాల కరపత్రాలు గ్రామస్తులకు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో కోరంగి నాగమల్లేశ్వరరావు, కర్నాటి సుబ్బారావు, బండ్ల పున్నారావు, షేక్ షాజహాన్, యామర్తి కోటేశ్వరరావు, ఎం వెంకటేశ్వర్లు, కారుబోల మరియదాసు, గౌరు రాజేష్, పందుల బుల్లెబ్బాయి, గణేషుని నాగయ్య, ఆర్ వేణుగోపాలరావు, కె.భూషయ్య, చాగంటి శ్రీధర్, షేక్ హుస్సేన్, ఎండీవో వై.హనుమారెడ్డి, ఈవోపీఆర్డీ వరూధుని, పంచాయతీ కార్యదర్శి శశికళ, సచివాలయ సిబ్బంది. వలంటీర్లు, సారథులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎంపీపీ వర్ధంతి



రామిరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో గల బొల్లాపల్లి మండల మాజీ ఎంపీపీ తుమ్మా రామిరెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని రామిరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ బొల్లాపల్లి మండలం ఎంపీపీగా రామిరెడ్డి చేసిన సేవలను గుర్తుచేసుకొని ఆయన మంచితనాన్ని కొనియాడారు. అలాగే మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ నాయకురాలు నన్నపనేని సుధలు పాల్గొని రామిరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తుమ్మా రామిరెడ్డి సతీమణి పాపులమ్మ, తుమ్మా వెంకటరెడ్డి, తుమ్మా కొండారెడ్డి, కుటుంబసభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రామిరెడ్డి సేవలను కొనియాడిన నేతలు

ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేశారు

బొల్లాపల్లి: ప్రజాదరణ కలిగిన నాయకుడు తుమ్మా రామిరెడ్డి అని మాజీ ఎంపీపీ తుమ్మా పాపులమ్మ అన్నారు. ప్రజానేత తుమ్మా రామిరెడ్డి 17వ వర్ధంతిని మండలంలోని అయ్యన్నపాలెం, వెల్లటూరు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించారు. ఆయన విగ్రహాలకు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పులిహోర పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ ఎల్లవేళల ప్రజలకు అందుబాటులో ఉండి తన జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేసి ప్రజల్లో మంచి గుర్తింపు పొందారని అన్నారు. కార్యక్రమంలో టి.కోటిరెడ్డి, టి.సాయిబాబు, జి.చినవీరయ్య, చిన్నవెంకయ్య, బత్తి గురవయ్య, ఖజ్జాయం లక్ష్మీనారాయణ, అర్వపల్లి నరసింహారావు, లింగరాజు, అచ్చిరెడ్డి, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలతోనే దేశాభివృద్ధి



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి టి. ప్రవల్లిక

నరసరావుపేట టౌన్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలతోనే దేశాభివృద్ధి సాధ్యమని మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి టి. ప్రవల్లిక అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ రామకృష్ణ ఓరియంటల్ ప్రభుత్వ పాఠశాలలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. బడిఈడు పిల్లలను పనుల్లో పెట్టుకుంటే యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామన్నారు. 14 ఏళ్ల లోపు బాల కార్మికులు ఎక్కడైనా పనులు చేస్తుంటే తమకు సమాచారం ఇవ్వాలని కార్మిక శాఖ అధికారి విష్ణు తెలిపారు. కార్యక్రమంలో టూటౌన్ ఎస్ఐ రాజానాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. సత్యనారాయణ సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.





రంగనాయక స్వామికి దీపార్చన

సొలస గ్రామంలో శ్రీ భూసమేత రంగనాయక స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం దీపార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పర్చూరి రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో శంఖు, నామ, చక్ర, స్వస్తిక్ వంటి ఆకారాల్లో ప్రమిదలను అందంగా అలంకరించి వెలిగించారు. దీపకాంతులలో దేవాలయం దేదీప్యమానంగా కనిపించింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. -యడ్లపాడు

కనపర్రులో ఘనంగా చర్చి ప్రారంభోత్సవం



నాదెండ్ల: కనపర్రు శివారు మైనంపాడు గ్రామంలో శుక్రవారం రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన ఎఫిఫానియా లూథరన్ దేవాలయం ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఏఈఎల్‌సీ మోడరేటర్ బిషప్ డాక్టర్ కె.ఎఫ్.పరదేశిబాబు, గుంటూరు సినేడ్ వెస్ట్ బిషప్ జె.ప్రభాకరరావులు ప్రారంభించారు. ముందుగా చర్చి ఆవరణలో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి సందేశాన్ని ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంఘ పెద్దలు, దైవజనులతో కనపర్రు సందడిగా మారింది. ఈ సందర్భంగా అతిథులుగా హాజరైన పరదేశిబాబు మాట్లాడుతూ చర్చి నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. క్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

అతిథులను మెమొంటోలు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్యారిస్ డెలిగేట్ ఏజీపీ గాలి జయప్రకాస్, ఏఈఎల్‌సీ వైస్ ప్రెసిడెంట్ జెమ్స్, సెక్రటరీ కిశోర్ బాబు, స్థానిక సంఘ కాపరి ఫాస్టర్ జంగా రాజారావు, సర్పంచ్ పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు ఎంపీపీ తలతోటి రాణి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లెద్దు చిన్నా, మాజీ ఎంపీటీసీ టీజే రత్తయ్య, మాలె వెంకటస్వామి, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

జగనన్న హయాంలోనే అభివృద్ధి

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- తెల్లబాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం




తెల్లబాడు గ్రామంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుంది ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. నూజెండ్ల మండలం తెల్లబాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లా పాల్గొని ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ జగనన్న భూహక్కు పథకం కింద ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని, నూజెండ్ల మండలంలోని అప్పాపురం, కొండ్రప్రోలు, తిమ్మాపురం గ్రామాల్లో అగ్రహార భూములను కూడా సర్వే చేసి రైతులకు హక్కులు కల్పిస్తున్నట్లు చెప్పారు. నాడు-నేడు పథకం కింద వందల కోట్ల నిధులతో పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. నూజెండ్ల మండలంలో గుండ్లకమ్మ నదిపై 5 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే మండలంలోని పువ్వాడ వద్ద రెండు జిల్లాలను కలపుతూ బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. కంభంపాడు గ్రామంలో కూడా లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే సీతారామపురం వద్ద నూతన ఆస్పత్రి నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టి మండలాన్ని మోడల్‌గా తీర్చి దిద్దుతామన్నారు.

టీడీపీ హయాంలో చేసింది శూన్యం

వినుకొండ నియోజకవర్గంలో టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల సభ్యులు పేదవారి దగ్గర కూడా సంక్షేమ పథకాల పేరుతో దోచుకోవడం తప్ప చెప్పుకోదగిన ఏఒక్క అభివృద్ధి పనులు జరుగలేదన్నారు. నియోజకవర్గంలో అనేక గ్రామాలల్లో సీసీ రోడ్లు కూడా నాసిరకంగా వేసి ప్రజాధనాన్ని దోచుకున్నారన్నారు. నీరు చెట్టు, ఉపాధి హామీ, ఇంకుడు గుంతలు, పేరుతో కోట్లాది రూపాయలు పనులు చేయకుండానే దోచుకున్నారని దుయ్యబట్టారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని. గతంలో కంటే వినుకొండ నియోజకవర్గంలో ఎంత మార్పు వచ్చిందో ప్రజలకు తెలుసని రానున్న రోజుల్లో టీడీపీకి ప్రజలు బుద్ధిచెబుతారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నక్కా నాగిరెడ్డి, ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జెడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, వైస్ చైర్మన్ కొమిరిశెట్టి రామారావు, వెంకటేశ్వర రెడ్డి, తలారి ఆంజనేయులు, జెడ్పీ కోఆప్షన్ గుండాల స్వెనోమ్, ఒంగూరి ప్రసాద్, గాదె నాగార్జున రెడ్డిలతో పాటు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మినీలారీ బోల్తా - డ్రైవర్‌కు గాయాలు



చిలకలూరిపేట: పూలలోడుతో వస్తున్న మినీలారీ టైరు పగిలి బోల్తా కొట్టిన సంఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. బెంగుళూరు నుంచి పూల లోడుతో గుంటూరుకు వెళుతున్న మినీలారీ శుక్రవారం తెల్లవారు జామున పట్టణంలోని అడ్డరోడ్డు సెంటర్‌కు చేరుకునేసరికి టైరు పేలటంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు గాయలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది గాయపడిన డ్రైవర్‌కు ప్రాథమిక చికిత్స చేసి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న అర్బన్ సీఐ సీహెచ్ సీతారామయ్య ట్రాఫిక్ పోలీసులను అప్రమత్తం చేసి క్రేన్ ద్వారా బోల్తాపడిన లారీని తొలగించి, ట్రాఫిక్ క్లియర్ చేశారు.

రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు

బొల్లాపల్లి : రోడ్డు ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసినట్లు బండ్లమోటు ఎస్ఐ డి. చెన్నకేశవులు శుక్రవారం తెలిపారు. ట్రాక్టర్, ఆటో ఢీనడంతో నలుగురికి గాయాలయ్యాయని, అయ్యన్నపాలెం నుంచి కారంపూడికి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో మార్గమధ్యంలోని చక్రాయపాలెం గ్రామసమీపంలో పొలాల్లో పైపులు పనిచేస్తున్న ట్రాక్టర్ రోడ్డుపైకి వచ్చి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో టి.హనుమంతరావు, టి.వెంగమ్మతో పాటు మరో ఇరువురు గాయపడ్డారు. ఈ సంఘటనపై ఆటో డ్రైవర్ టి. హనుమంతరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

కారు స్వాధీనం

ఈపూరు: ఆటోను కారు ఢీకొట్టడంతో కూరగాయల వ్యాపారి మృతి చెందిన సంఘటనలో కారును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహమ్మద్ ఫిరోజ్ తెలిపారు. గురువారం రాత్రి మండల పరిధిలోని వనికుంట సమీపంలో ఆటోలో కూరగాయలు అమ్ముకుంటున్న నాదినీడి ఏడుకొండలును వినుకొండ నుంచి వస్తున్న కారు ఢీకొట్టడంతో ఏడుకొండలుకు తీవ్రగాయాలై మృతిచెందాడు. మృతికి కారణమైన కారును పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.